క్లుప్తంగా

చిల్డ్రన్స్ హోమ్ విద్యార్థులకు నిత్యావసరాలు అందజేత



చిల్డ్రన్స్ హోమ్‌కు సరుకుల పంపిణీ చేస్తున్న అధ్యాపకులు కొండారవి, అధ్యాపకులు

ఉంగుటూరు: సేవా కార్యక్రమాల్లో విద్యార్థుల భాగస్వామ్యం పెరగాలని ఎస్ఏఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావు అన్నారు. మంగళవారం చేబ్రోలు ఎంవీఎస్ మెమోరియల్ చిల్డ్రన్స్ హోమ్‌లోని పేద విద్యార్థులకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, ఆపిల్స్, కమలాలు, స్వీట్లు కళాశాల తరపున విద్యార్థులతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో డా. కొండర రవి, అధ్యాపకురాలు నిర్మలజ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ రెడ్డయ్య, ఐక్యూ కో ఆర్డినేటర్ కొండా వి, రసాయన శాస్త్ర విభాగ అధ్యక్షురాలు హెబ్జిబా, చరిత్ర అధ్యాపకులు పి భాస్కర రావు, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు ఉమాశంకర్ కామర్స్ అధ్యాపకులు లావణ్య, కుమారి మౌనిక పాల్గొన్నారు.

గోపన్నపాలెంలో డ్రోన్‌తో భూముల చిత్రీకరణ

దెందులూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు భూముల రీసర్వేలో భాగంగా మంగళవారం డ్రోన్‌తో భూముల చిత్రీకరణ చేపట్టారు. తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య, మండల సర్వేయర్ రమణ పర్యవేక్షణలో డ్రోన్‌తో సర్వే చేశారు. సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

గాయపడిన బాధితురాలికి పరామర్శ



బేతపూడి మరియమ్మను పరామర్శించిన ప్రజాప్రతినిధులు, అధికారులు

దెందులూరు: దెందులూరులో నిర్వహించిన వైఎస్సార్ ఆసరా పథకం ప్రారంభ సభలో బేతపూడి మరియమ్మ ప్రమాదవశాత్తు కిందపడటంతో గాయాలయ్యాయి. వైఎస్సార్ ఆసరా ఏపీఎం వేణుగోపాల్ దెందులూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు పోకల రాంబాబు, వైఎస్సార్‌సీపీ మహిళానేత పులిపాటి శ్యామలాదేవి, సీఏలు బాధితురాలిని పరామర్శించి పండ్లు, ఆర్థిక సాయం అందించారు.

వసంతవాడలో గుర్రపు డెక్క తొలగింపు



పేరంటాల చెరువులో గుర్రపు డెక్క తొలగింపు పనులు పరిశీలిస్తున్న ఏఈ శ్రీనివాస్

పెదపాడు: పెదపాడు మండలంలోని వసంతవాడలో పేరంటాల చెరువులో గుర్రపు డెక్క తొలగింపు పనులు ఏఈ శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. వేసవి కాలం దృష్ట్యా గుర్రపు డెక్కను పూర్తిస్థాయిలో తొలగించాలన్నారు. ప్రజలు పరిశుభ్రమైన తాగు నీరు అందించాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొవ్వలి వీఆర్వో మురళి గుండెపోటుతో మృతి



మురళీకృష్ణ (ఫైల్)

దెందులూరు: కొవ్వలి గ్రామ వాసి వీఆర్వో ఎస్.మురళీకృష్ణ మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ప్రస్తుతం ఆయన పాలగూడెంలో విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు భార్య ఉన్నారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కొవ్వలిలోని ఆయన నివాసానికి చేరుకుని మురళి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కొవ్వలి, పాలగూడెం సర్పంచ్ ఇంటే టిమధులతా గంగాధర్, పీ. సునీత, వైస్ ఎంపీపీ గొల్ల నాగరాజు, తహసీల్దార్లు ఆయన భౌతికాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వీఆర్వో మురళి మృతికి సంతాపం

పెదపాడు: మల్కాపురం, పాలగూడెంలో వీఆర్వో మురళి మరణించడంతో ఆ సంఘం జిల్లా కోశాధికారి రవికుమార్, జిల్లా సభ్యుడు సంతాపం వ్యక్తం చేసారు.

అక్రమంగా మట్టి తవ్వకాలు

ఏలూరు రూరల్: ఏలూరు మండలం చాటపర్రులో అక్రమ మట్టి తవ్వకాలు కొనసాగుతున్నాయి. మంగళవారం పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో స్థానిక జనార్దనస్వామి చెరువు నుంచి మట్టి తరలించి ప్రైవేట్ లేఅవుట్‌లో వేస్తున్నారు. ఇందుకోసం చెరువు వద్ద ఇద్దరు వ్యక్తులు మట్టి తోలుతున్న ట్రాక్టర్ల సంఖ్య లెక్కిస్తున్నారు. దీనిపై తహసీల్దార్ బి సోమశేఖర్‌ను వివరణ కోరగా మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. చెరువు ఇరిగేషన్‌శాఖ పరిధిలో ఉందని, వీఆర్వో నుంచి మరింత వివరణ తీసుకుంటామని తెలిపారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ఆసరా దోహదం

- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- గణపవరంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



గణపవరంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు, చిత్రంలో ఎమ్మెల్యే వాసుబాబు



సమావేశంలో పాల్గొన్న మహిళలు

గణపవరం: మహిళల ఆర్థికాభివృద్ధికి ఆసరా పథకం దోహద పడుతుందని, ఈ పథకాన్ని మహిళలు సక్రమంగా వినియోగించుకోవాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. మంగళవారం గణపవరంలోని కేవీపీ పంక్షన్ హాలులో గణపవరం, సరిపల్లె, వరదరాజపురం, వెలగపల్లి, కొమ్మర, అర్ధవరం వల్లూరు, వాకపల్లి గ్రామాలకు చెందిన డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా (డ్వాక్రా రుణమాఫీ) మూడో విడత పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇచ్చిన మాటప్రకారం వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. చంద్రబాబు డ్వాక్రా రుణాలన్నీ మాఫీ చేస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక మాఫీ మాట మరుగున పెట్టి మహిళలను మోసం చేశారని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో ఐదేళ్ల పాలన తర్వాత మళ్లీ అధికారం కోసం ఎన్నికల ముందు డ్వాక్రా మహిళలకు రూ.10 వేలు బ్యాంకు ఖాతాల్లో జమచేశారని గుర్తు చేశారు. మాట తప్పి మోసం చేసిన చంద్రబాబుకు మహిళలు బుద్ధిచెప్పి తమ విజ్ఞతను చాటారని అభినందించారు. జగన్ అధికారంలోకి వచ్చిన ఏడాది నుంచే క్రమం తప్పకుండా మహిళలకు ఆసరా పథకాన్ని అమలు చేస్తున్నారని అన్నారు. మన రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మహిళలకు అమలు చేస్తున్నన్ని పథకాలు దేశంలోనే మరే రాష్ట్రంలోనూ లేవన్నారు. మహిళల కోసం ఇన్ని పథకాలు అమలుచేస్తున్న జగనన్నకు అండగా నిలవాలని కోరారు. చంద్రబాబు కేవలం ప్రచారంతోనే పాలన చేశారని, జగన్ మాత్రం ప్రచారానికి దూరంగా లబ్ధిదారులకు నేరుగా పథకాలను అందిస్తూ వారి ఆదరాభిమానాలు పొందుతున్నారని వాసుబాబు అన్నారు.

ప్రతిపక్షాలు, పచ్చమీడియా కలిసి దుష్ప్రచారం

అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేయడాన్ని ప్రతిపక్షాలు, పచ్చమీడియా జీర్ణించుకోలేకపోతున్నాయని, అందుకే ప్రభుత్వంపై ఎన్నోరకాల దుష్ప్రచారానికి దిగజారాయని విమర్శించారు. తొలుత మహిళలు తమకు రుణమాఫీ చేసిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతూ జై జగన్ నినాదాలతో హోరెత్తించారు. జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం మహిళలకు వైఎస్సార్ ఆసరా రుణమాఫీ చెక్కులు అందజేశారు. 579 స్వయం సహాయక సంఘాలకు రూ.4,58,74,968 చెక్కులను అందజేశారు. మహిళలకు ఇన్నిరకాలుగా అండగా నిలిచిన జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాల్సిన బాధ్యత మహిళలదేనని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సూర్యబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, నియోజకవర్గ పరిశీలకుడు వేంద్ర వెంకటస్వామి, ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మి, మండల ఉపాధ్యక్షురాలు సలాది రత్నకుమారి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు రాము, గణపవరం సర్పంచ్ మూర అలంకారం, జిల్లా వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి నడింపల్లి సోమరాజు, జిల్లా అధికార ప్రతినిధి మాదేటి సురేష్, పార్టీ నాయకులు కాకర్ల శ్రీను, రొంగల శ్రీను, తోటశ్రీను, జంపన శ్రీను, ఎం.రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు దండురవి, బత్తి సీతామహాలక్ష్మి, మహ్మద్‌జానీ, సర్పంచ్‌లు చనుమూరి లక్ష్మీభవాని, కొడేటి నర్సింహమూర్తి, ముచ్చర్లవేణు, కురెళ్ల వెంకటరత్నం, అడపా రవిబాబు పాతంశెట్టి శ్రీను పాల్గొన్నారు.

నేడు కైకరంలో ఆసరా సభ

ఉంగుటూరు: కైకరం జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండులో బుధవారం మధ్యాహ్నం 2గంటలకు డ్వాక్రా మహిళలతో వైఎస్సార్ ఆసరా సభ ఏర్పాటు చేసినట్లు వైకేపీ వెలుగు ఏపీఎం పద్మావతి తెలిపారు. ఈ సభల ద్వారా కైకరం, ఎ.గోకవరం గ్రామ పంచాయతీల్లో 272 స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొంటారని తెలిపారు. మండలంలోని 2,702 మంది మహిళలకు రూ.3,30,27,368 ప్రయోజనం చేకూరునుందని ఆమె తెలిపారు. కైకరం, ఎ.గోకవరం, గోపారాజుపాడు, లంకమలపల్లి, రామన్నగూడెం, వీకే పురం, బ్రహ్మానందపురం గ్రామాలకు చెందిన డ్వాక్రా మహిళలకు ఆసరా లబ్ధి అందిస్తామని ఏపీఎం పద్మావతి వివరించారు.

నేడు వీఆర్ కన్వెన్షన్ హాల్లో వైఎస్సార్ ఆసరా పండుగ

నిడమర్రు: వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులకు 3వ విడత నగదు పంపిణీ కార్యక్రమం బుధవారం ఉదయం 9 గంటలకు పెదనింద్రకొలను వంకా రవీంద్ర (వీఆర్) కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసినట్లు వైసీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొని లబ్ధిదారులతో మాట్లాడతారన్నారు. నేడు తోకలపల్లి, బైనేపల్లి, ఆముదాలపల్లి, చిననింద్రకొలను, దేవగోపవరం, పెదనింద్రకొలను, నిడమర్రు, మందలపర్రు, గుణపర్రు గ్రామాలకు సంబంధించిన 503 గ్రూపు సభ్యులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమాన్ని అధిక సంఖ్యలో వైసీపీ శ్రేణులు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరవ్వాలని సత్యకుమార్ కోరారు.

నేడు గడపగడపకూ మన ప్రభుత్వం

పెదపాడు: మండలంలోని కలపర్రులో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించనున్నట్టు పెదపాడు మండల కన్వీనర్ అప్పనప్రసాద్ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పాల్గొని గడప గడపకూ వెళ్లి ప్రజలకు ప్రభుత్వం అందించిన పథకాలను వివరిస్తూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటారని చెప్పారు. మండలంలోని కార్యకర్తలు అభిమానులు నాయకులు విధిగా హాజరుకావాలని ప్రసాద్ తెలిపారు.

ఉపాధి వేతనం రూ.15 పెంపు

భీమడోలు: జాతీయ ఉపాధి హామీ పథకం పేదల పాటి వరమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిపల్లి కృష్ణకుమారి అన్నారు. సూరప్పగూడెంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పూడిక తీత పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. ఉపాధి కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో రోజు వారీ కూలీ సొమ్మును రూ.257 అదనంగా రూ.15 పెంచి రూ.272 అందిస్తోందన్నారు. తద్వారా కూలీలకు ఆర్థిక భరోసా కలుగుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకం ద్వారా పేదలకు పని కల్పించడంతో పాటు వారిని ఆదుకోవడమే లక్ష్యంగా పని చేస్తున్నాయన్నారు.

భూ వివాదంపై ఘర్షణ

దెందులూరు: నాగులదేవునిపాడులో భూ వివాదం పాత గొడవల నేపథ్యంలో ఇరువర్గాల మధ్య సోమవారం జరిగిన ఘర్షణలో ఇద్దరికి గాయాలయ్యాయని ఎస్సై ఐ.వీర్రాజు తెలిపారు. బాధితులు ఏలూరు ప్రభుత్వ వైద్యశాలలో చేరారని ఆయన తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై బుధవారం తెలిపారు.

ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారం



నియోజకవర్గ ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: సమస్యలు ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని, స్పందనతో పాటు ఎమ్మెల్యే కార్యాలయంలో వచ్చే వినతులపై అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయంలో దెందులూరు, పెదపాడు, పెదవేగి, ఏలూరు రూరల్ మండలాల నుంచి స్వయం ఉపాధి, రోడ్లు, ఇంటి రుణం, ఇళ్ల స్థలాలు, వ్యక్తిగత అవసరాలు ఇతర సమస్యలపై పలువురు ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందజేశారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం భరోసా

దెందులూరు: ప్రజారోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పించిందని, ఫ్యామిలీ డాక్టర్ పథకంలో భాగంగా 104 వాహనాల ద్వారా వైద్య సిబ్బంది రోగుల చెంతకే వెళ్లి వారికి మెరుగైన వైద్యం అందించాలనేది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. గోపన్నపాలెంలో ప్రభుత్వం మంజూరు చేసిన మూడు 104 వాహనాలను ఎమ్మెల్యే కొఠారు, గోపన్నపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రోజాలలిత ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, వైస్‌ఎంపీపీ వేమూరి జితేంద్ర, ఎంపీటీసీలు ఏనుగు అంజలి ప్రసాద్, సువ్వా ప్రభుదాసు, సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరికుమార్, ఎంపీహెచ్ఈఓ నాగరాజు ఉన్నారు. డాక్టర్ రోజాలలిత మాట్లాడుతూ గోపన్నపాలెం, పోతునూరు, కామవరపుకోట పీహెచ్‌సీలకు ఒక్కో అంబులెన్స్ కేటాయించామన్నారు.

వైభవంగా శ్రీరామనవమి వేడుకలు ప్రారంభం



పెళ్లి కుమారునిగా ముస్తాబైన స్వామివారు

భీమడోలు: గుండుగొలనులోని పురాతన దేవాలయంగా పేరొందిన సీతారామస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు వైభవంగా మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆలయ ట్రస్టీ కొండ గంగారాజ్‌కుమార్ పర్యవేక్షణలో అర్చకులు గోపాలాచార్యులు, సుధీరాచార్యులు ఆధ్వర్యంలో ఆలయంలో స్వామి వారికి శాస్త్రోక్తంగా పూజలు చేసారు. సీతారామస్వామిని పెళ్లి కుమారునిగా అలంకరించి పూజలు చేశారు. స్వామివారికి జలాభిషేకం చేసారు. తొలుత స్వామి వారిని విశేషంగా అలంకరించి ముస్తాబు చేసారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కోవెల ప్రదక్షిణలు చేసారు. తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

పూళ్ల మెగా వైద్య శిబిరం

భీమడోలు: పూళ్లలోని కల్లి కొండమ్మ, కల్లి నాగరత్నమ్మ ఆసుపత్రిలో మంగళవారం ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని పూళ్ల సర్పంచ్ దాయం సుజాత ప్రారంభించా రు. పూళ్లలోని నోచర్ల శ్రీరాములు జ్ఞాపకార్థం మాజీ సర్పంచ్ నోచర్ల సుజాత ఆర్థిక సాయంతో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఆయుష్ హాస్పిటల్స్ జనరల్ ఎండీ వైద్యులు డాక్టర్ భాను కిరణ్, ఎంఎస్ ఆర్థోపెడిక్ వైద్యులు ఎంఎల్‌వీ సాయికృష్ణ పూళ్ల, పరిసర గ్రామాలకు చెందిన 200 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసారు. రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. శిబిరంలో ఈసీజీ, బీపీ, బ్లడ్ సుగర్ వంటి పరీక్షలు చేసారు. తొలుత సర్పంచ్ దాయం సుజాత మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన రోగులకు ఉచిత వైద్య సహాయాన్ని అందించిన నోచర్ల సుజాత, శ్రీనివాస్ సేవలను ప్రశంసించారు. మానవత మండల అధ్యక్షుడు పచ్చా వెంకటేశ్వరరావు, ఆర్గనైజర్ పెనుగొండ శ్రీనివాస్, పెద్దలు వడ్డి సత్తులు, మజ్జి రంగబాబు పాల్గొన్నారు.

విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాలు సాధించాలి

దెందులూరు: విజయాలు సాధించేవారి వెనుక రహస్యాలు ఏమీ దాగి ఉండవని, నిరంతర శ్రమ, ప్రణాళిక, అంకితభావంతోనే ఎవరికైనా విజయం సాధ్యపడుతుందని ఏపీ మైనార్టీ కమిషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ మహ్మద్ ఇంతియాజ్ అన్నారు. జోగన్నపాలెం మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యా సంస్థలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ లక్ష్యాలను ఎంచుకుని సాధనకు కృషి చేయాలన్నారు. విద్యతోనే అభివృద్ధి, అవగాహన, ఉన్నతస్థానం సాధ్యపడుతుందన్నారు. మౌలానా విద్యా సంస్థల యాజమాన్యాన్ని, అధ్యాపకులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాముకాటుకు వ్యవసాయ కూలి మృతి

ఉంగుటూరు: ఉంగుటూరు పడమర పేటకు చెందిన ఉప్పాటి పండు (47) పాము కాటుకు గురై మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం పండు ఆదివారం సాయంత్రం పొలంలో గడ్డి కోస్తుండగా పాము కాటేసింది. వెంటనే అతడిని తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆసుపత్రిలోనే కన్నుమూశారు. పండు మృతదేహానికి సోమవారం పోస్టుమార్టం నిర్వహించారు. పండుకు భార్య కుమారి, కుమారులు మరళి, రాజు ఉన్నారు. పండు సోదరుడు సాల్మన్‌రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు.

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

పెదవేగి : మండలంలో ఖాళీగా ఉన్న 9 వలంటీర్ పోస్టులను భర్తీ చేయడానికి ఎంపీడీఓ జి రాజ్‌మనోజ్ మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూకు 8 మంది హాజరయ్యారని ఎంపీడీఓ తెలిపారు. పెదకడిమి వలంటీర్‌గా దుర్గా భవాని, గార్లమడుగుకు నాగరాజు, ప్రేమ జ్యోతి, విజయరాయికి పావని, వనిత, వీర్రాజు, కవ్వాగుంటకు ప్రశాంతి, కూచింపూడికి సంధ్య ఎంపికయ్యారని ఎంపీడీఓ తెలిపారు. మండల పరిషత్ ఏఓ కేవీ జాన్సన్, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం



104 వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

గణపవరం: ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రజల ఆరోగ్య భద్రతకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి బాధ్యత తీసుకున్నారని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద పిప్పర, కాగుపాడు పీహెచ్‌సీలకు నూతనంగా మంజూరైన రెండు 104 వాహనాలను ఆయన ప్రారంభించారు. 108, 104 వాహనాలు ప్రతి పీహెచ్‌సీ పరిధిలో సేవలందిస్తున్నాయన్నారు. ప్రజల ఇంటివద్దకే వైద్యులు వచ్చి వైద్యం అందించే ఫ్యామిలీ డాక్టర్ పథకం పేద ప్రజలకు వర మని అన్నారు. 104 వాహనాల ద్వారా ప్రతీ గ్రామంలో నెలకు రెండు పర్యాయాలు వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తారన్నారు. జిల్లా నోడల్ అధికారి జ్యోసిరాయ్, గణపవరం పీహెచ్‌సీ వైద్యుడు పులపర్తి సంతోష్, కిరణ్మయి, పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.ప్రియాంక, పీహెచ్‌సీ వైద్యాధికారులు వర్మ, శ్రావణ్, సీహెచ్‌వో జాలాదివిల్సన్, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, గణపవరం సర్పంచ్ మూర అలంకారం, పార్టీ మండల కన్వీనర్ దండు రాము పాల్గొన్నారు.

పరీక్షలంటే భయం వీడాలి



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న మానవత సభ్యులు

గణపవరం: విద్యార్థులు పరీక్షల పట్ల భయంవీడి, సానుకూల దృక్పథం కలిగి ఉంటే మంచి ఫలితాలు సాధించవచ్చునని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు తాడేపల్లి మోహనరావు అన్నారు. మంగళవారం గణపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, విద్యాజ్యోతి హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు మానవత సంస్థ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు హెచ్‌ఎం కె.రాంబాబు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో మోహనరావు మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్ణయించుకుని సాధన దిశగా కృషి చేయాలని సూచించారు. బట్టీ విధానంలో కాకుండా విషయాన్ని పూర్తిగా అవగాహన చేసుకుని చదవాలన్నారు. నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి కృషి, పట్టుదలతో కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపినవారికి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత రీజియన్ ఛైర్మన్ కాకర్ల వినాయక, మండల మానవత అధ్యక్షుడు వంకాయల రామారావు, మాజీ అధ్యక్షుడు గంటా అన్నవరం, కార్యదర్శి బుద్ధారపు పుల్లయ్య, సభ్యులు విద్యాజ్యోతి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీతో ఆర్థిక స్వావలంబన



తడి,పొడి చెత్తను వేరు చేసే విధానాన్ని పరిశీలిస్తున్న జిల్లా పరిశీలకుడు శ్యామలరావు

భీమడోలు: చెత్త నుంచి సంపద తయారీ ద్వారా పంచాయతీలు ఆర్థిక స్వావలంబన సాధిస్తాయని జిల్లా ప్రాజెక్టు రిసోర్స్‌సెంటర్ పరిశీలకుడు శ్యామలరావు అన్నారు. భీమడోలులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద మంగళవారం జిల్లా పరిధిలోని కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి, కైకలూరు మండలాల్లోని ఎంపిక చేసిన పంచాయతీలకు చెందిన సర్పంచులు, ఉపసర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ, ఇంజినీరింగ్ సహాయలకు ఒక రోజు శిక్షణ తరగతులను నిర్వహించారు. జిల్లా చైతన్య యువజన సంఘం అధ్యక్షుడు పాము మాన్‌సింగ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా డీపీఆర్‌సీ పరిశీలకుడు శ్యామలరావు, ఎంపీడీవో జీఎల్ఎన్‌వీ రాఘవన్ పాల్గొన్నారు. ప్రభుత్వం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించిందని, వాటి నిర్మూలనకు సచివాలయ సిబ్బంది విస్తృతంగా తనిఖీలు చేయాలన్నారు. చెత్త చెదారాలను, ప్లాస్టిక్ వ్యర్థాలను క్లాప్ మిత్రలు ఎప్పటికప్పుడు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. వాటి నుంచి సంపద తయారీ చేసుకుని పంచాయతీ ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. అనంతరం పొడి, తడి చెత్తలను వేర్వేరు చేసే విధానాన్ని వారు పరిశీలించి క్లాప్ మిత్రలకు తగు సూచనలందించారు. భీమడోలు గ్రామకార్యదర్శి ఎస్.ఠాగూర్, పడమటిపాలెం, తాడినాడ, భైరవపట్నం, లోకుమూడి, కోడూరు, వడవల్లి, చాటకాయి పంచాయతీలకు సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.